www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 17 జులై 2024



ఉపాధి బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ కూలీల బకాయి సొమ్ము వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు అన్నారు. మంగళవారం సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జగన్నాథపురం గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సోమరాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీల సొమ్ము ఆరేడు వారాలు పెండింగ్‌లో ఉందని, తక్షణం బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు పిల గాదినాయుడు, తోట సత్యనారాయణ, గుణ్ణం వెంకటేశ్వరరావు, పిలా కోటేశ్వరరావు, మొండి రమణ, వెంపటాపు కనకారావు, కూనవరపు నాగభూషణం, ఈదర సత్యనారాయణ, సైదు సుబ్బాయమ్మ పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం..!



రబీ ధాన్యం అమ్మి రెండు నెలలైనా అందని సొమ్ము

పశ్చిమలో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు బకాయి

ఎప్పటికి జమవుతాయో తెలియని పరిస్థితి

ఖరీఫ్ పెట్టుబడుల కోసం రైతులు నానావస్థలు

ప్రభుత్వం వెంటనే సొమ్ము చెల్లించాలని రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో వరిసాగు చేసిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. పండిన పంటను విక్రయించి నెలలు గడుస్తున్నా సొమ్ము మాత్రం అందని దుస్థితి నెలకొంది. గత పాలకులు చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే సరిచేసి ధాన్యం సొమ్ము జమ చేయాలని అన్నదాత వేడుకుంటున్నాడు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలవ్యాప్తంగా రబీలో మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. దాదాపు రూ.1300 కోట్లు విలువ చేసే ధాన్యం రైతుల నుంచి కొనుగోలు జరిగింది. ఏప్రిల్ 28వ తేదీకి ముందు రూ.400 కోట్లు జమ చేశారు. తర్వాత రైతులకు చిల్లిగవ్వ జమ చేయకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏలూరు జిల్లాలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెట్టుకోగా రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. దాదాపు రూ.440 కోట్లు ధాన్యం సొమ్ము రైతులకు చెల్లించాల్సి ఉండగా ఏప్రిల్ 28వ తేదీకి రూ.196.09 కోట్లు మాత్రమే చెల్లించారు. నెలలు గడుస్తున్నా మిగిలిన ధాన్యం సొమ్ము జమ కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో ధాన్యం సొమ్ము జమపై అయోమయం నెలకొంది. దీంతో రైతులు, రైతుసంఘాలు మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులకు తమ గోడు చెప్పుకుంటూ వినతిపత్రాలు ఇచ్చారు. రెండు నెలలు గడిచినా డబ్బు జమ కాలేదని, రబీలో పెట్టుబడులకు తెచ్చిన అప్పుల వాళ్ల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయని రైతులంతా లబోదిబోమన్నారు. దీంతో జులై మొదటివారంలో ప్రభుత్వం ధాన్యం బకాయిల కింద రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. మే పదోతేదీ వరకూ ధాన్యం విక్రయించిన రైతులకు ఈ సొమ్ము చెల్లించాలని నిర్ణయించి చెల్లింపులు చేసింది. దీంతో పశ్చిమగోదావరి జిల్లాలో రూ.900 కోట్ల ధాన్యం బకాయిలకుగాను రూ.500 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.242 కోట్లకుగాను రూ.197 కోట్లు వరకూ చెల్లింపులు జరిగాయి. మే పదో తేదీ తర్వాత ధాన్యం విక్రయించిన ఏఒక్క రైతుకూ ధాన్యం సొమ్ము జమ కాలేదు. దీంతో ఇంకా 'పశ్చిమ'లో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు మొత్తం రూ.445 కోట్లు ధాన్యం బకాయిలు రైతులకు చెల్లించాల్సి ఉంది. ధాన్యం విక్రయించి రెండు నెలలు గడిచిపోయింది. దీంతో ధాన్యం సొమ్ము చెల్లించాలని మిగిలిన రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఖరీఫ్ పెట్టుబడుల కోసం నానావస్థలు

ధాన్యం సొమ్ము అందకపోవడంతో రైతులు ఖరీఫ్ పెట్టుబడుల కోసం నానావస్థలు పడుతున్నారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రబీలో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. ధాన్యం సొమ్ము అందకపోవడంతో అప్పులు ఇంకా తీరలేదు. దీంతో కొత్తగా పెట్టుబడికి అప్పు తెచ్చుకునే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో భార్యల మెడలో పుస్తెలు తాకట్టు పెట్టి ఖరీఫ్ పెట్టుబడులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నాట్లు పెద్దఎత్తున వేస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.పది వేలకుపైగా రైతులు పెట్టుబడి పెట్టారు. ధాన్యం సొమ్ము అందితే పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడాల్సిన పని ఉండేది కాదు. ధాన్యం సొమ్ము అందక నానాయాతన పడుతున్నారు.

ధాన్యం కొనుగోలు రుణం కోసం కేబినెట్ ఆమోదం

పౌర సరఫరాల శాఖకు సంబంధించి ధాన్యం కొనుగోలు నిమిత్తం రూ.3,200 కోట్లు రుణం తీసుకునేందుకు మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి ఆమోద ముద్ర వేసింది. ఈ రుణం వచ్చాక ధాన్యం సొమ్ము జమ చేస్తారా.. ముందుగానే చెల్లిస్తారా వేచిచూడాలి. రుణం వచ్చే వరకూ రైతులు వేచిచూడాలంటే చాలా ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడనుంది. ఇప్పటికే ధాన్యం సొమ్ము కోసం నానా ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన సొమ్ము జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

నరసాపురం ఎంపిడిఒ అదృశ్యం..!



నరసాపురం: నరసాపురం ఎంపిడిఒ ఎం.వెంకటరమణరావు అదృశ్యమయ్యారు. ఈ నెల మూడో తేదీ నుంచి ఆయన మెడికల్ లీవ్ పెట్టి స్వస్థలం కృష్ణా జిల్లా బంటుమిల్లి అయినప్పటికీ కుటుంబం కానూరు సమీపంలో ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి నుండి బయటికి వెళ్లిన రమణరావు తిరిగి సాయంత్రానికీ ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కారు పెనమలూరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నట్లు సమాచారం. సెల్‌ఫోన్ కూడా కాల్ డైవర్షన్‌లో ఉంది. దీంతో ఆయన ఆచూకీ సస్పెన్స్‌గా మారింది. ఎంపిడిఒ మానసిక ఒత్తిడితోనే మెడికల్ లీవ్‌పై వెళ్లారని, దీనికి రాజకీయ నేతలే కారణమనే ప్రచారం సాగుతోంది. నరసాపురంలోని మాధవాయిపాలెం రేవు పంటు పాటదారుడు సుమారు రూ.50 లక్షల వరకు మండల పరిషత్‌కు చెల్లించాల్సి ఉంది. బకాయి చెల్లించాలని కొంతకాలంగా ఎంపిడిఒ ఒత్తిడి చేస్తున్నా పాటదారుడు దాటవేస్తూ వచ్చాడు. దీంతో మానసిక ఒత్తిడికి ఎంపిడిఒ సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. ఈయన నరసాపురం ఎంపిడిఒగా ఈ ఏడాది జనవరి 24న విధుల్లో చేరారు. వచ్చే ఏడాది మార్చిలో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రూ.50 లక్షలు బకాయి ఉండటంతో ప్రభుత్వం ఎంపిడిఒపై ఏం చర్య తీసుకుంటుందోనని కొన్ని రోజుల నుంచి ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన కన్పించకుండా పోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రమణరావు సోమవారం రాత్రి మచిలీపట్నం రైల్వే స్టేషన్ వద్ద సంచరించినట్లు సమాచారం

విదేశాలకు వెళ్లే మహిళలు మోసపోకుండా చర్యలు

మహిళలకు అవసరమైన శిక్షణిచ్చేందుకు కార్యాచరణ

సురక్షితంగా విదేశాలకు పంపేందుకు ప్రణాళిక

గల్ఫ్ వర్కర్స్ సహాయ కేంద్రం ప్రారంభానికి చర్యలు

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విదేశాలకు వెళ్లే మహిళలు మోసపోకుండా పటిష్టమైన చర్యలు తీసుకోబోతున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో రిజిస్టర్డ్ ఏజెన్సీల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లే మహిళలు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదులు చేయడంతో ఆమె స్పందించారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఎపి లిమిటెడ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమై గల్ఫ్ సురక్షిత వలసలపై సమీక్షించారు. జిల్లాలో ఉపాధి మార్గాలు మెండుగా ఉన్నాయని, మహిళలు వాటిని వినియోగించుకోవాలని కోరారు. కుటుంబ సభ్యులకు దూరమై సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు జిల్లాలో ఉపాధి మార్గాలపై ఆలోచన చేయాలన్నారు. గల్ఫ్ వెళ్లాలని కృత నిశ్చయంతో ఉన్న మహిళలు ఏజెన్సీల ద్వారా మోసపోకుండా నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణతోపాటు సురక్షితమైన మార్గం ద్వారా గల్ఫ్‌కు పంపేందుకు కార్యాచరణ రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు ఎలా వెళ్లాలి, ఇందుకు అవసరమైన ధ్రువపత్రాలు ఏం కావాలి, సురక్షితమైన ఏజెన్సీనా.. కాదా, తొలుత ఎవరిని సంప్రదించాలి, శిక్షణ ఎలా పొందాలి తదితర విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలో గల్ఫ్ వర్కర్స్ సహాయ కేంద్రం ప్రారంభిస్తామన్నారు. డిఆర్‌డిఎ, పోలీస్, ఐసిడిఎస్, కార్మిక శాఖల సిబ్బందితో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆగస్టు 6న గుర్తింపు పొందిన, పొందని ఏజెన్సీలతో వర్క్‌షాప్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. గల్ఫ్‌కు వెళ్లే మహిళలను గుర్తించి, వర్క్‌షాప్‌లో వారికి పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కుకింగ్, భాష నేర్చుకోవడం, బేబీ కేరింగ్, హౌస్ కీపింగ్ వంటి అంశాలపై పూర్తి శిక్షణ అందిస్తామన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఐఎల్‌ఒ ప్రతినిధి నెహ్వా అద్వానీ, ఇంటర్నేషనల్ నాన్ రెసిడెంట్స్ తెలుగు ఆర్గనైజేషన్ సిఇఒ హేమ గల్ఫ్‌కు వెళ్లే మహిళా వర్కర్ల భద్రత, సురక్షిత ప్రయాణంపై వారి సూచనలు, సలహాలను జిల్లా అధికారులకు వివరించారు. జిల్లాలో చేపట్టిన బృహత్తర కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఎపి లిమిటెడ్ జనరల్ మేనేజర్ బిఆర్.క్రాంతికుమారి, హెచ్‌ఆర్ మేనేజర్ బి.సతీష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ జి.గోపీ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా కార్మిక శాఖాధికారి ఆకన లక్ష్మి, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, జిల్లా నైపుణ్య శిక్షణాభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల చట్టాల అమలుపై ప్రత్యేక కృషి

ఎస్‌సి, ఎస్‌టిల చట్టాల అమలుపై రెవెన్యూ, పోలీస్ అధికారులు ప్రత్యేక కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యానాదులు, ఎరుకల జీవనశైలి మెరుగుకు కృషి చేస్తామన్నారు. వీరవాసరం ఎస్‌సి కాలనీలో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుతోపాటు త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశించినట్లు తెలిపారు. నిర్ణీత కాలంలో ఛార్జిషీట్ కూడా ఫైల్ చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు అనంతరం పరిహారం చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. భీమవరం ఎంఎల్‌ఎ పులవర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఫిర్యాదుదారు ఎస్‌సి, ఎస్‌టి అవునా, కాదా అనేది నిర్ధారించుకుని న్యాయం చేయాలన్నారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఊహాజనిత కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కచ్చితమైన కేసుల్లో వేగవంతమైన పరిష్కారానికి పోలీస్ యంత్రాంగం కృషి చేయాలని కోరారు. ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఎస్‌సి, ఎస్‌టి కేసుల నమోదులో బాధితులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కమిటీ సభ్యులు జె.సత్యసుధామ మాట్లాడుతూ నిజంగా దాడికి గురైన సందర్భంలో కేసుల నమోదులో జాప్యం జరుగుతుందన్నారు. పౌర హక్కుల దినోత్సవం నామమాత్రంగా జరుపుతున్నారని, ప్రత్యేక శ్రద్ధతో నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టిలకు హక్కులపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన ఎస్‌సి, ఎస్‌టిల పథకాలను పునరుద్ధరించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిల నివాస ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగు, రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెంటపాడు మండలం రావిపాడులో ఎస్‌సిలపై నమోదైన సెక్షన్ 307ను సమీక్షించాలని కోరారు. కమిటీ సభ్యులు తెన్నేటి జగజ్జీవన్‌రావు మాట్లాడుతూ ఎస్‌టి కమ్యూనిటీ హాళ్లు జిల్లాలో పెద్దఎత్తున నిర్మించాలని కోరారు. మరో సభ్యుడు ఎస్.త్రిమూర్తులు మాట్లాడుతూ కేసులు పెట్టడం వల్ల వచ్చే నష్టాలు కూడా తెలియజేయాలని స్పష్టం చేశారు. సిహెచ్.మంగరాజు మాట్లాడుతూ పెంటపాడు మండలం రావిపాడులో ఇరిగేషన్ భూమిని ఎస్‌సిలు వివిధ కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారన్నారు. ఈ స్థలాన్ని ఒక సైనికునికి కేటాయించడంతో వివాదం చెలరేగిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, డిఎస్‌పిలు జి.శ్రీనివాసరావు, డిఎస్ఆర్ఎస్ఎన్.మూర్తి, వి.నారాయణస్వామిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికలపై హత్యాచారాలను నిరసిస్తూ ప్రదర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర




మానవహారం

రాష్ట్రం బయట, రాష్ట్రంలో బాలికలు, మహిళలపై చోటుచేసుకుంటున్న అత్యాచారాలు, వేధింపులు, హత్యలను అరికట్టాలని కోరుతూ ఐద్వా, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ ఆధ్వర్యాన మార్టేరులో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం మార్టేరులోని పిహెచ్‌సి నుంచి సెంటర్ వరకు చేపట్టిన ప్రదర్శనలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు నివారించాలని నినదించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు డి.జ్యోతి, పి.రత్నకుమారి, ఎస్.పార్వతి, ఎం.గంగ, ఎస్.భవాని, మీరా, కనకదుర్గ, సులోచన, నీలిమ, లక్ష్మి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాల అమలు ఆపాలి

ఐలు ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్



కరపత్రాలు ఆవిష్కరించిన ఐలు నేతలు, న్యాయవాదులు

కొత్త క్రిమినల్ చట్టాల అమలు నిలిపి వేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) భీమవరం యూనిట్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం కొత్త క్రిమినల్ చట్టాలు, వాటి వల్ల నష్టాలు గురించి వివరిస్తూ స్థానిక న్యాయస్థానాల వద్ద మంగళవారం ఐలు ఆధ్వర్యాన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐలు ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా కొత్త చట్టాలు ఉన్నాయన్నారు. ఈ కొత్త చట్టాలను రూపొందించేటప్పుడు ఎటువంటి చర్చా పార్లమెంట్లో జరగకుండా ఆమోదించడం శోచనీయమన్నారు. వీటివల్ల ప్రజల జీవన విధానానికి ప్రమాదం వాటిల్లుతుందన్నారు. కొత్త చట్టాలు కోర్టుల అధికారాలను తగ్గించి ఎగ్జిక్యూటివ్ అధికారాలను పెంచుతుందని తెలిపారు. పాలకులు తాము చేసే చట్టవ్యతిరేక పనులకు అడ్డుకట్ట వేసుకోవడం కోసమే జ్యుడిషియరి అధికారులు తగ్గించారని ఆరోపించారు. ఈ చట్టాల అమలును తక్షణం ఆపి, చట్టాల్లో మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.కాస్ట్రో, ఎ.అంబేద్కర్, జి.వెంకటేశ్వరరావు, పిజె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టూరి రామకృష్ణ సేవలు ఎనలేనివి

వర్ధంతి సందర్భంగా వివిధ పార్టీల నేతలు

ప్రజాశక్తి - ఆచంట



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజల కోసం పనిచేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం వల్లూరు సెంటర్‌లో మాజీ సర్పంచి కామ్రేడ్ చిట్టూరి రామకృష్ణ 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్‌లో ఆయన స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడుతూ కామ్రేడ్ చిట్టూరి రామకృష్ణ వల్లూరు గ్రామ సర్పంచిగా గ్రామానికి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. రామకృష్ణ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ తుది శ్వాస విడిచే వరకు సిపిఎంలోనే కొనసాగారని, ఆయన హయాంలో వల్లూరులో జరిగిన అభివృద్ధి పనులు ఈ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు చిట్టూరి రాంబాబు, సిపిఎం నాయకులు బొర్రా ధర్మారావు, తాళం సుబ్బారావు, పి.మోహన్ రావు, టిడిపి కూటమి నాయకులు దేవల రమేష్, నేలపూడి రామ్మోహన్‌రావు, గెద్దాడ శ్రీనివాసరావు, తాళం శ్రీను, ఆరుమిల్లి సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాస్, తోట తాతాజీ, కడలి ఉమామహేశ్వరరావు, పంది సత్యనారాయణ, పెచ్చటి సత్యనారాయణ, బండి వెంకటేశ్వరరావు, గాజులపాటి వెంకట్రావు, బోనం సత్యనారాయణ, ఊడిమూడి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎన్‌సిసి క్యాడెట్లకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పాండురంగరాజు

ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అభినందనీయం

డిఎన్‌ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులతోపాటు ఎన్‌సిసి క్యాడెట్ల సేవలు అద్వితీయమని డిఎన్‌ఆర్ కళాశాల ఉపాధ్యక్షులు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. మంగళవారం స్వీప్ యాక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు అందించిన ప్రశంసా పత్రాలను కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లకు అందించారు. ఈ సందర్భంగా గోకరాజు పాండు రంగరాజు మాట్లాడుతూ ఓటు నమోదు నుంచి కౌంటింగ్ వరకు ఎన్‌సిసి క్యాడెట్లు సహాయ సహకారాలు అందించడం గొప్ప విశేషమని అన్నారు. ప్రిన్సిపల్ జి.మోజేష్ మాట్లాడుతూ ఇటువంటి జాతీయ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లు సేవలు అందించడం ఒక ఆదర్శనీయమైన కార్యక్రమమని అన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఏప్రియల్ నెల నుంచి డిఎన్‌ఆర్ ఎన్‌సిసి క్యాడెట్లు మూడు నెలలపాటు ఓటు నమోదు మొదలు కౌంటింగ్ వరకు పోలీసు శాఖకు ఎంతో సహకరించారని, 26 మందికి ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, పి.రామకృష్ణంరాజు, మేజర్ డాక్టర్ ఎ.వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల సమాచారం ఇవ్వాలి

అధికారులకు ఎంపిపి వాసురెడ్డి సూచన

ప్రజాశక్తి - పెనుమంట్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వాసురెడ్డి

గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులకు సంబంధిత అధికారులు విధిగా సమాచారం పంపాలని స్థానిక ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు రెడ్డి) అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపిడిఒ పి.పద్మజ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులను పిలిచి శాఖల పనితీరు గురించి మండల పరిషత్ సభ్యులకు వివరించాలని ఎంపిడిఒ పి.పద్మజ అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంలో వైద్యశాఖ సభ్యులకు వివరిస్తున్న సమయంలో తమ గ్రామ సర్పంచి వెలగల సుగుణకు వైద్యశాఖ నుంచి ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని మాజీ సాగునీటి సంఘం మండల కమిటీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. భవిష్యత్తులో ప్రతి శాఖ నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ నుంచి మండలంలో 50 శాతం రైతులకు తమ ఖాతాలో జమ కావలసి ఉందని, కొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో జమ అవుతాయని ఎఒ ఎ.జ్యోషిలా రైతులకు వివరించగా, జుత్తిగ సర్పంచి తమనంపూడి వీరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం సార్వా నారుమడి దశ నుంచి నాట్లు వేస్తున్నారని, రైతుల చేతిలో చిల్లిగవ్వ లేదని, వారికి రావలిసిన సొమ్మును వచ్చేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు చేసిన కార్యక్రమాల గురించి అధికారులు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, వైస్ ఎంపిపి వాసంశెట్టి కిరణ్, రెండో వైస్ ఎంపిపి ఈది అనిత, ఎంపిటిసిలు, తహశీల్దార్ కోట లక్ష్మీ కళ్యాణి, అయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మోనిటరింగ్ కమిటీ సభ్యులు

దళితుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిల్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో మోనిటర్ కమిటీ సభ్యులు బుధవారం కలెక్టర్‌ను సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పసుపుగుచ్ఛాన్ని అందజేసి జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఎవరైతే బాధితులు ఉన్నారో వారికి అందవలసిన పరిహారం త్వరితగతిన చెల్లించాలన్నారు. ముఖ్యంగా ఛార్జ్ షీట్ వేయడంలో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చీకటి పల్లి మంగరాజు, జె.సత్య సుధామ, సింగం త్రిమూర్తులు, తానేటి బాబు జగజీవన్ రావు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు అండగా ఉంటా : ఎంఎల్‌ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



ఎంఎల్‌ఎకు ఫొటో జ్ఞాపికను అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు

సమాజాన్ని సృజనాత్మకంగా చూసి మరో కోణం ఆవిష్కరించే ఫొటోగ్రాఫర్లకు తన అండ ఎప్పటికీ ఉంటుందని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఉషా గ్రాండ్‌లో నిర్వహించిన ఫొటోగ్రాఫర్ల దినోత్సవం సందర్భంగా నికాన్ కంపెనీ కొత్త కెమెరాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తమ స్వలాభం కోసం సమాజాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. కొన్నిచోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి, లక్షల రూపాయల విలువ చేసే సైట్లను కోట్లకు కొన్నట్టు చూపించి దోచుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం అందిస్తామని, అందులో భాగంగానే ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఫొటోగ్రాఫర్లకు ఆసరాగా నిలుస్తున్న నికాన్ కంపెనీ వారిని ఈ సందర్భంగా అభినందించారు.

వెంప-బేతపూడి రోడ్డుపై గుంతలు పూడ్చాలని ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం టౌన్



నినదిస్తున్న నేతలు

వెంప-బేతపూడి-తుందుర్రు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుపై గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కరుకువాడ బేతపూడిలో సిపిఎం ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంప-బేతపూడి-తుందుర్రు ఆర్అండ్‌బి రోడ్డు మీదుగా నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆదివారం వెంప గ్రామానికి చెందిన యువకుడు ఇంటి ప్రకాష్ బైక్‌పై వస్తుండగా గుంతలో పడి గాయాల పాలై మృతి చెందాడన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రమాదాలు పునరావృతం కాకుండా వెంప-బేతపూడి-తుందుర్రు రహదారిపై గోతులను పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పెదపాటి జయానందరావు, వేగి మోహన్‌రావు, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

1.7 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదు

నరసాపురం : జిల్లాలో 1.7 మిల్లీమీటర్లు సగటు వర్షపా తం నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవా రం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. నరసాపు రంలో 16.2 మిల్లీమీటర్లు, మొగల్తూరు 6.2, యల మంచిలి 4.2, పాలకొల్లు 4, ఇరగవరం 2.2, పెను గొ ండ 1.2, తణుకు 0.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముమ్మరంగా పారిశుద్ధ్య నిర్మూలన పనులు

గణపవరం: మండలకేంద్రమైన గణపవరంలో పారిశుద్ధ్య నిర్మూలన పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు గ్రామ సర్పంచ్ మెరా అలంకారం మంగళవారం తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల ప్రతిరోజూ కురుస్తున్న వర్షాల వల్ల గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించకుండా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రధాన రహదారుల పక్కన ఉన్న డ్రైనేజీల్లో మురికినీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలో ఉన్న పూడికను తొలగించి వర్షపు నీరు వెళ్లిపోయే విధంగా పంచాయతీ సిబ్బందితో పనులు చేస్తున్నట్లు తెలిపారు. చెత్తాచెదారాలు లేకుండా జెసిబితో పూర్తిస్థాయిలో చెత్తను తొలగించి, ప్రజలకు అంటురోగాలు రాకుండా 16 వార్డుల్లో బ్లీచింగ్ వేస్తున్నామన్నారు. అదేవిధంగా దోమల నివారణకు దోమల మందు పిచికారీ చేస్తున్నామని, గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.ఎస్.ఆర్.ప్రసాద్, మూడవ సచివాలయం కార్యదర్శి బి.భాస్కర్ పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

తాడేపల్లిగూడెం: పేదవాని ఆకలి తీర్చేందుకే టిడిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్లో ప్రతి మంగళవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో తాలూకా ఆఫీస్ సెంటర్‌లో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం మంగళవారం 90 వారానికి చేరింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ 90వ వారం తన ఖర్చుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. వచ్చేనెల తన మాతృమూర్తి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి అవకాశం ఇవ్వాలని టిడిపి శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, ఉమ్మడి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో 40 మందికి చికిత్స

పెనుగొండ: ఉచిత కంటి శిబిరంలో 40 మందికి పైగా రోగులకు చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం పెనుగొండ సర్పంచ్ శ్యామల సోని ఆధ్వర్యంలో స్మైల్ ఫౌండేషన్ వారి ద్వారా డాక్టర్ జి.అజోరే తణుకు వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.విజయ్ కుమార్, డాక్టర్ అర్జు వెంకట రమణ పాల్గొన్నారు. సదరు వైద్య శిబిరంలో 40 మందికి పైగా రోగులకు ఉచితంగా హస్పప్పిటీ, పార్మసిస్టులు, కంటిలో శుక్లాలు, కంటి నుంచి నీరు కారుట, పుసులు కట్టుట మొదలగు సమస్యలు ఉన్న వారికి కంటి పరీక్షలు చేసి 13 మందికి కంటి సంబంధించిన కంటి డ్రాప్స్, మందులు అందించామని తెలిపారు. కంటి అద్దాలు అవసరమైన 20 మందికి సబ్సిడీ ద్వారా కంటి అద్దాలు వృష్టి కోల్పోయి, ఆపరేషన్లు అవసరమైన ఏడుగురికి ఎల్‌వి కంటి ఆసుపత్రి వారి ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి సిఫార్సు చేశామన్నారు. ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకకోడు ప్రక్షాళన పనుల పరిశీలన

ఉండి: ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లోని నీరు బయటకు వెళ్లక నారుమడులు ముంపుకు గురికావడంతో గ్రామంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలోని ఇసుకకోడు ప్రక్షాళన పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దాసరి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఇసుకకోడు చెత్తాచెదారం, తూడు తదితర వ్యర్థాలతో నిండిపోవడంతో రైతులు వర్షాకాలంలో పంటలు ముంపుకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఆదేశాల మేరకు ఇసుక కోడు ప్రక్షాళన చేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకటలక్ష్మీ నాయుడు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

16 మంది విద్యార్థులు ఎంపిక

పాలకొల్లు: స్థానిక చాంబర్స్ కళాశాలలో జరిగిన ట్రైనీ, ఇన్ఫోసిస్, హెక్సావేర్ కంపెనీల ప్రాంగణ ఎంపికలకు 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పాలకొల్లు చాంబర్స్ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో మంగళవారం కంపెనీల ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు 92 మంది అభ్యర్థులు హాజరు అవ్వగా 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారని, వీరికి జీతం, ఇతర అలవెన్స్ కలిపి రూ.12 వేల నుంచి రూ.20 వేలు నెలకు అభ్యర్థులకు వేతనం పొందుతారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రెటరీ కలిదిండి రామరాజు అభినందించారు.

డిగ్రీ కళాశాలలో మానవత కెరీర్ గైడెన్స్

పెనుగొండ: మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్‌విబిసి డాక్టర్ ఇవిఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ వైవి అప్పారావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత సేవా సంస్థ చేసే కార్యక్రమాలన్నీ ఎంతో వినూత్నంగా ఉంటాయని, సమాజానికి మానవత ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని, విద్యార్థులు అందరూ సేవా దక్పథం అలవర్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమానికి మానవత కెరీర్ గైడెన్స్ కన్వీనర్, అభివృద్ధి విస్తరణ కమిటీ సభ్యులు డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, కళాశాలల కరస్పాండెంట్ రామచంద్ర రాజు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు.

నేరాలు - ఘోరాలు

పురుగుమందు సేవించి మహిళ మృతి

ఆచంట: పెళ్లై మూడు నెలలకే మహిళ మృతిచెందిన సంఘటన ఆచంట మండలం కోడేరు ఉత్తర పాలెంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన శీలం సాయిబాబుకు మండలంలోని కోడేరు ఉత్తరపాలెం గ్రామానికి చెందిన కట్ట వీరబ్రహ్మం దుర్గమ్మ మొదట కుమార్తె నాగలక్ష్మికి ఏప్రిల్ 12వ తేదీన వివాహం జరిపించారు. వివాహ వేడుకలకు సంబంధించి 10 సెంట్లు పంట పొలం రూ.1.80 వేలు పసుపు కుంకుమ కింద అందజేశారు. ఈ నేపథ్యంలో ఆషాడ మాసం సందర్భంగా నవవధువు తన సొంత ఇంటికి రప్పించారు. ఈ నేపథ్యంలో నవ వధువు నాగలక్ష్మి ఫోను తీయలేదని కోపంతో భర్త సాయిబాబు భార్యను మందలించడంతో ఆమె ఈనెల 12వ తేదీ శనివారం సాయంత్రం పురుగుల మందు సేవించడంతో కుటుంబ సభ్యుల హుటాహుటిన భీమవరం ప్రయివేట్ హాస్పిటల్‌కి తరలించగా మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజ్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆస్పత్రి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతురాలు తండ్రి వీరబ్రహ్మం పెళ్లికి చేసిన అప్పులు తీరతాయని కొండంత ఆశతో ఉపాధి నిమిత్తం ఇటీవలే ఇతర దేశాలకు వెళ్లారని, ఈ లోగానే తన పెద్ద కుమార్తె తనువు చాలించడంతో కోడేరు ఉత్తర పాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుండెపోటు బాధితునికి చికిత్స

నరసాపురం: నరసాపురం ఏరియా ఆసుపత్రిలో గుండెపోటు వచ్చిన వ్యక్తికి ఖరీదైన రూ.40 వేల ఇంజక్షన్ చేసి వైద్యులు ప్రాణాలు కాపాడిన సంఘటన స్థానికంగా చోటుచేసుకుంది. వైద్యుల కథనం మేరకు స్థానిక రుస్తుంబాదకు చెందిన వాసా సుబ్రమణ్యం(66)కు సోమవారం ఛాతీలో ఎడమవైపు తట్టుకోలేని నొప్పి వచ్చింది. బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించగా వైద్యులు కె.జాన్ హర్సన్, కె.లీలా మారుతిలు ఇసిజి పరీక్షలు చేసి గుండెపోటు అని నిర్ధారించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న రూ.40 వేలు విలువ చేసే టెనెక్ట్ రెల్ 40 ఎమ్‌జి ఇంజక్షన్ సకాలంలో చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితున్ని 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని బంధువులు తెలిపారు. వైద్యం అందించిన వైద్యులను ఆసుపత్రి సూపరిటెండెంట్ ఆర్.సుప్రియ అభినందించారు.

గేదెపై అత్యాచారం!

వీరవాసరం : మండలంలో తోకలపూడి గ్రామంలో తన గేదెపై అత్యాచారం జరిగిందంటూ పిల్లి సీతారామయ్య అనే రైతు స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం వీరవాసరం ఎస్‌ఐ రమేష్ పశువైద్యాధికారిని ప్రియాంక రాబర్ట్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గేదె యజమాని చెప్పిన వివరాల ప్రకారం ఈనెల మూడవ తేదీన తన పశువుల పాకలో కట్టిన గేదెపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం జరిపినట్టు తెలిపాడు. ఈ విషయమై వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసంలో ఫిర్యాదు చేశానన్నారు. కొంతమంది మద్యానికి, గంజాయికి అలవాటు పడిన వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశాడు. తన గేదె కాళ్లను వేరే పశువుల పాక నుంచి తెచ్చిన తాళ్లతో కట్టి అత్యాచారం చేసినట్టు గేదెపై ఉన్న గాయాలను బట్టి తెలుస్తుందని అన్నాడు. ఒక ప్రయివేటు పశు వైద్యుడు వ్యక్తం చేసిన అనుమానం బట్టి తన గేదెపై అత్యాచారం జరిగిందని నమ్ముతున్నానని సీతారామరాజు తెలిపాడు. దీనిపై ఎస్‌ఐ మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపాడు.

నీట మునిగిన కాలనీ

మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

పేద ప్రజలకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మింపజేసిన కాలనీల పరిస్థితి నేడు దయనీయంగా తయారైంది. తాళ్లకోడు కాలనీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆనాడు ఎన్నికలకు ముందు అట్టహాసంగా, ఆర్భాటంగా ఓట్లు వేస్తారని లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. అంతేతప్ప కనీసం మౌలిక సదుపాయాలతో ఇళ్లు ఏర్పాటు చేద్దామనే ఆలోచన అటు అధికారులకు గాని, ప్రజాప్రతినిధులకు గాని లేదు. వారి నిర్లక్ష్య ఫలితాన్ని ఇప్పుడు వేలాది మది ప్రజలు అనుభవిస్తున్నారు. 73 ఎకరాల కాలనీలో ఎక్కడా కనీసం మౌలిక సదుపాయాలు, మంచినీరు, రోడ్లు లేవు. ఇల్లు కట్టుకుంటే ఇంట్లోకి ఎలా వెళ్లాలో, రాత్రిపూట దారి కనిపించే పరిస్థితి లేదు. ఎవరి ఇల్లు వారు గుర్తుపట్టలేని పరిస్థితి నెలకొంది. అటువంటి కాలనీల్లో ప్రభుత్వం ప్రజల్ని కాపురం ఉండమని ఒత్తిడి తెచ్చింది. అత్యవసరంగా ఇల్లు నిర్మాణం చేపట్టకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామంటూ బెదిరించడం, హెచ్చరించడం చేశారు. ఇలా ఒకటి కాదు, రెండు కాదు ప్రతి గ్రామంలోనూ కూడా ఇదే పరిస్థితి. వానాకాలం వచ్చింది, వర్షాలు కురవడంతో కాలనీలు మొత్తం నీట మునిగాయి. ఈ పథకం ప్రారంభమయ్యే నాటికి మండల కేంద్రమైన ఆకివీడు మేజర్ పంచాయతీగా ఉండేది. రాష్ట్రం మొత్తం మీద ఒక మేజర్ పంచాయతీ



నీట మునిగిన తాళ్లకోడు 73 ఎకరాల కాలనీ

పరిధిలో 73 ఎకరాలు ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయడం ఆనాటి చారిత్రాత్మక అంశం. సిపిఎం ఆనాడు చేసిన ఉద్యమ ఫలితంగానే ఇంతటి బృహత్తర ఫలితాలు లభించింది. అయితే తీరా ప్రజలకు అందబోయేసరికి అంతా హడావుడిగా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి సుమారు 4 వేల మంది ఇల్లు లేని వారి జాబితాలు సిద్ధం చేసి 2 వేల మందికి పట్టాలు అందజేసినా.. మండలంలోని తాళ్లకోడు కాలనీ పరిస్థితి దయనీయంగా ఉంది. కనీసం సరైన రోడ్డు లేదు. మొత్తం ఇప్పటి వరకు 400 మంది అక్కడ ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటివరకు



నీటిలో అవస్తలు పడుతున్న మహిళ

వందమంది కాపురాలు ప్రారంభమయ్యాయి. మిగిలిన ఇల్లు నిర్మాణం సాగుతున్నాయి. ఈ దశలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు గాని, కాపురాలు ఉన్న ఇళ్లల్లో గాని వెళ్లేందుకు దారి లేదు, కాలనీ మొత్తం కనీసం మూడు అడుగుల నీరు నిలిచిపోయింది. రోడ్ ఎక్కడ ఉందో కనిపించే పరిస్థితి లేదు. మొత్తం నీళ్లమయంతో చిన్న చెరువుల తయారైంది. ఆ నీళ్లలో రకరకాల జీవాలు, పాములు కూడా వస్తున్నాయంటూ అక్కడ వారు వాపోతున్నారు. ఇక్కడ కాలు వేస్తే ఎక్కడ కింద పడతారో తెలియని పరిస్థితి. కొద్దిచోట్ల ఇప్పటికే నీరు దుర్గంధ పూరితంగా తయారయ్యాయి. పరిస్థితి మరో నాలుగు రోజులు కొనసాగితే విష జ్వరాలు, మలేరియా, డెంగీ వంటివి వచ్చే ప్రమాదం ఉందంటూ అక్కడ ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు. ఆ ఇల్లు వదిలేసి వచ్చే పరిస్థితి లేదంటూ వాళ్లు వాపోతున్నారు. అత్యవసర ప్రాతిపదికపై రోడ్లు ఏర్పాటు చేయకపోతే కాలనీ వాసులు ఇళ్ళ తాళం వేసి బయటకు రావడం తప్ప వేరే గత్యతరం లేదంటున్నారు. ఇల్లు కట్టుకున్నా ఉండటానికి సరైన సౌకర్యాలు లేక ఇల్లు కోల్పోయే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వల్లూరులో 'ఆడపడుచులం.. పట్టి వేశాం'

ప్రజాశక్తి - ఆచంట



రోడ్డుమీద వరినాట్లు వేస్తున్న మహిళలు

పల్లెల్లో ఇప్పటికీ కొన్ని సంప్రదాయాలు వింత గొల్పుతాయి. వరినాట్లు సమయంలో పంట పొలాలు వెంబడి ఉన్న రహదారుల వెంట కొనసాగించే పట్టివేసాం.. సంప్రదాయం ఇంకా మండలంలో కొనసాగుతుంది. మహిళా కూలీలు వరినాట్లు పట్టుకొని రోడ్డుపై వెళుతున్న వాహన చోధకులను ఆపి పసుపు, కుంకుమలకు సొమ్ములు ఇవ్వాల్సిందిగా కోరతారు. గతంలో వరినాట్లు సమయంలో బావ వరస అయ్యేవారు పంట పొలాల్లోకి వస్తుంటే మహిళా కూలీలు ఆపి ఈ సంప్రదాయం కొనసాగించేవారు. ప్రస్తుతం ఈ విధానం రోడ్డుకి ఎక్కింది. ఆచంట మండలం వల్లూరు ఆర్ అండ్ బి రహదారిపై ఆడపడుచులు పట్టి వేస్తూ మోటార్ సైకిల్ ఆపుతూ, పసుపు కుంకుమ కింద సొమ్ములు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. వచ్చేది ఎవరనేది పక్కన పెట్టి వాహనాలను నిలిపివేసి మహిళలు సొమ్ముల కోసం డిమాండ్ చేయడం ప్రయాణికులకు కాస్త ఇబ్బంది కలిగించినా.. సాంప్రదాయం ప్రకారం డబ్బులు ఇవ్వకుండా వేసిన పట్టి దాటి వెళ్లకూడదని ఆడపడుచులు చెబుతూ ఉంటారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా వెంకట రామరెడ్డి

పెనుమంట్ర : మండలంలోని జుత్తిగ గ్రామ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా డి.వెంకట రామారెడ్డి నియామకం అయ్యారు. మంగళవారం లయన్స్ క్లబ్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షులుగా డి.వెంకట రామారెడ్డి, కార్యదర్శిగా జి.జ్యోతి, కోశాధికారిగా ఎస్.రామకృష్ణారెడ్డి నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు వెంకటరామారెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా తనకు అవకాశం ఇచ్చినందుకు క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసేందుకు కలసికట్టుగా అడుగులు వేద్దామన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఛైర్‌పర్సన్ గొంట్ల కృష్ణమూర్తి, రీజియన్ సెక్రటరీ రమేష్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం

కాళ్ల: కోమటిగుంట గ్రామంలో కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్న పేద కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని టిడిపి నాయకుడు బోణం శివకుమార్ అన్నారు. కోమటిగుంట గ్రామంలో నాలుగు పేదకుటుంబాలకు ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. వేగేశ్న నరసింహరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి.వెంకటరాయ వర్మ గ్రామంలో ఇల్లు ఎవరు నిర్మించుకున్నా వారికి రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. కోలనపల్లి ఎంపిటిసి వేగేశ్న సత్యనారాయణరాజు చేతులమీదుగా చెక్కులు అందించారు.

రీసర్వే నిలుపుదల అభినందనీయం

ఉండి: భూ రీ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణం రాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీ సర్వేను అడ్డుపెట్టుకుని గత ప్రభుత్వం వేలాది ఎకరాల ప్రభుత్వ ప్రయివేటు భూములను తన అనుయాయులకు కట్టబెట్టిందని విమర్శించారు.

ఎంఎల్‌ఎ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

వీరవాసరం: మండలంలో గత కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలను పరిష్కారించాలని భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామంజనేయులు(అంజిబాబు) సంబంధిత అధికారులను ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం కొణితివాడ - మడుగుపోలవరం ఆర్ అండ్ బి రహదారి పనులును ప్రారంభించారు. రహదారిని పునర్నించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర కూడా చేశారు. ఇటీవల ఈ మార్గంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి చంద్రవేఖర్ ఆధ్వర్యంలో మరోసారి ఎంఎల్‌ఎ అంజిబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఎంఎల్‌ఎ స్పందించారు.

డెంగీ నివారణపై అవగాహనా ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన, వైద్య చికిత్స కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ తెలిపారు. వైద్య సిబ్బందితో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుంచి కాళ్ల బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జ్వరం, వ్యాధి లక్షణాలైన తలనొప్పి, కీళ్ల, కండరాల నొప్పులు వంటివి ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి మీద అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌టిఎస్ బి.సుజనా, ఎస్‌టిఎల్ఎస్ కె.చంద్రదొర రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరుగు లేప్రెసి సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, వైద్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఒక్క ఓదార్పు చాలు..

మానవత కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు

ఉండి: ఆపదలో వున్న వ్యక్తికి ఒక్క చిన్న ఓదార్పుతో వెయ్యి ఏనుగుల బలం వస్తుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అభివృద్ధి, విస్తరణ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ సమావేశ మందిరంలో మానవత ఉండి మండల శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ అధ్యక్షులు కట్రెడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జానకి రామరాజు మాట్లాడుతూ కష్టాల్లో వున్న వారికి మాట సాయం గొప్ప ఊరట నిస్తుందన్నారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులుగా పెన్మెత్స రామకృష్ణం రాజు, ప్రధాన కార్యదర్శిగా గాదిరాజు రంగరాజు, కోశాధికారిగా కట్రెడ్డి తాండవ నాగ సత్య నారాయణ, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పెదపుల్లేరు ఎంపిటిసి రాయి రాములమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొడిగింపు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ జిఒ ఎంఎస్ నెం 82ను జారీ చేసినట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ తెలిపింది. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని, ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్(ఇహెచ్‌ఎస్) తరహాలో వైద్య సేవలు పొందవచ్చుని, అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'నన్ను చంపేందుకు ముందే స్కెచ్ వేశారు'

కాళ్ల: వైసిపి నాయకులు, అధికారులు కలిసి తనని చంపేందుకు ముందే స్కెచ్ వేశారని ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం పెదఅమిరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను అక్రమంగా అరెస్టు చేసి కస్టడీలో టార్చర్, హత్యాయత్నం చేయడంపై రఘురామకృష్ణంరాజు పెట్టిన కేసు విషయంలో పలువురు నాయకులు, అధికారులు అవగాహనారాహిత్యంతో చేస్తున్న వ్యాఖ్యలుగా ఉన్నాయన్నారు. పోలీసు అధికారులపై కేసును కొందరు ఎందుకు తప్పుపడుతున్నారని విమర్శించారు.